# ఒక అత్తయ్య కథ

వసుంధర

నేను అత్తయ్య ఇంటికి వెళ్ళి ఓ వారంరోజు లుండి వచ్చాను. ఆ వారం రోజులూ అత్తయ్య నన్ను పూచికపుల్లకూడా ముట్టుకోనివ్వకుండా చాలా అభిమానంగా చూసింది. పనిలో ఏదైనా సాయం చేయనివ్వమని అడిగితే "చూడమ్మా—రేపు పెళ్ళై అత్తారింటికి వెడితే ఎలాగూ తప్పదు నీకు. ఏదో అభిమానంగా వచ్చావ్—అంతే చాలు నాకు. నువ్వు మాత్రం కాళీగా వున్నావ్ కనుకనా — రాత్రింబవళ్ళు చదువుకుంటూ నాలుగురోజులు విశ్రాంతి కొచ్చావ్" అంటూ అవీ యివీ చెప్పి పని చేయనిచ్చేది కాదు.

అత్తయ్య అభిమానానికి నేనాశ్చర్యపడ్డాను. అత్తయ్య కాడ పిల్లలులేరు. ఇద్దరు మగపిల్లలూ పెళ్ళై దూరంగా ఎక్కడో ఉద్యోగాలూ, సంసారాలూ చేసుకుంటున్నారు. మొగుడు అంటే నా మావయ్య - మూడు నాలుగేళ్ళలో రిటైరవుతాడనుకుంటాను డబ్బుకేం లోటులేదు. భూములున్నాయి బ్యాంకు డిపాజిట్లున్నాయి. నెలజీతముంది. అత్తయ్య మొగుడి పై సంపాదన చెప్పుకోదగ్గదని మా ఇంట్లో చెప్పుకుంటూ వుంటారు ఆడపిల్లలపైనున్న అభిమానంవల్ల అప్పుడప్పుడు అత్తయ్య బంధువుల ఇంట్లో పిల్లలని తనింటికి రప్పించుకుని నాలుగురోజు లుంచుకుని పంపించేస్తూంటుంది. మా నాన్నగారావిడకు కడగొట్టు తమ్ముడు. అదివరలో అత్తయ్యింటికి నేను చాలాసార్లు వెళ్ళినప్పటికీ విడిగా ఒకత్తినీ వెళ్ళడం ఇదే ప్రథమం.

అక్కడ నేనుండగానే మా చిన్నత్తయ్య కూడా వచ్చింది. చిన్నత్తయ్యకు ఇద్దరాడపిల్లల తర్వాత ఒక మగపిల్లవాడు. ఆవిడ కాడపిల్లల మోజాట్టేలేదు సరిగదా—ఈ ఆడ సంతతో వేగలేక చస్తున్నానని విసుక్కుంటూంటుంది. మాటమాటకీ ఆవిడ ఆడపుట్టుకను హీనపరచడంవల్ల నాకావిడంటే సదభిప్రాయంలేదు. అత్తయ్య మాత్రం చిన్నత్తయ్యతో అభిమానంగా మాట్లాడి ఎంతో గౌరవం చూపింది. చిన్నత్తయ్యనుకూడా ఆవిడ ఏ పనీ చేయనివ్వలేదు

నేను వెళ్ళిన రోజున వచ్చిన చిన్నత్తయ్య ఆరో రోజున వెళ్ళిపోయింది. చిన్నత్తయ్య వెళ్ళిపోగానే అత్తయ్య నా వంక చూసి— "అమ్మయ్య—వెళ్ళింది మహాతల్లి!" అంది.

చిత్రంగా అత్తయ్యవంక చూశాను.

"చూడమ్మా — నువ్వయితే కాలేజీలో చదువుకుంటున్న పిల్లవు తర్వాత కాపురానికి వెళ్ళాల్సినదానివి ఏం సుఖపడ్డా సెలవుల్లోనూ, పెళ్ళికి ముందూ మాత్రమే! అయినా చదువు మనిషిని ఆర్పేస్తుంది. అందుకని నువ్వు సరదా పడుతున్నా పనిచేయవద్దన్నాను కానీ దానికే మొచ్చింది? ఏదో మాటవరసకి—నువ్వెందుకే నేనున్నాగా అంటాంకానీ అలాగన్నానుకదా అని ఓ పత్రిక పుచ్చుకుని మంచమెక్కి కూర్చోవాలా? ఎప్పుడొచ్చినా ఇంతే అది నేనేమైనా దాని పనిమనిషిననుకుంటుందో ఏమోమరి— ఏం చూసుకునో ఆ మిడిసిపాటు నా ఆస్తిలో సగముండదు వాళ్ళదంతా కలిసి ఈ నాలుగు రోజులూ చాకిరీ చేసిచేసి నా రెక్కలు ముక్కలయ్యాయనుకో"

నాకు గుర్తున్నంతవరకూ చిన్నత్తయ్య అత్తయ్యకు సాయపడ్డానికే ప్రయత్నించింది. అత్తయ్య పని చేయొద్దంటే — ఉత్తినే కూర్చుంటే నాకు తోచదే అనికూడా అంది. అలాగైతే పత్రికలు చదువుకోమని తనే చిన్నత్తయ్యకు సలహా ఇచ్చింది.

చిన్నత్తయ్యకు అత్తయ్యపట్ల గల గౌరవానికి కారణం లేకపోలేదు. పెద్దకూతురుకు పెళ్ళీడొస్తోంది. అత్తయ్య వితరణపట్ల ఇంట్లో

అందరికీ గౌరవభావముంది. చూసీచూడకా తన బంధువులకు ఆవిడ చాలా ఆర్థిక సహాయాలు చేస్తూంటుంది. చిన్నత్తయ్య ఆర్థిక పరిస్థితి చెప్పుకోదగ్గది కాదు. అందుకని ఆవిడ ఏ పరిస్థితుల్లోనూ తన అక్కను కించపర్చడానికి సాహసించదు.

కానీ జరగవలసింది జరగనే జరిగింది. చిన్నత్తయ్య ప్రవర్తనకు అత్తయ్యకోపం వచ్చింది. అత్తయ్య చిన్నత్తయ్య గురించి నాకింకా చాలా నేరాలు చెప్పింది. ఒకటి కాదు రెండు కాదు—చిన్నత్తయ్య వెళ్ళిందగ్గర్నుంచి నేను ప్రయాణమయేవరకూ ఒకదాని వెనుక ఒకటిగా నేరాలలా పుట్టుకొస్తూనే వున్నాయి. అవన్నీ వింటూంటే నాకు చిన్నత్తయ్యపట్ల చాలా అసహ్యం పుట్టుకొచ్చింది.

ఆ తర్వాత రెండు సంవత్సరాలకి—నేను బియ్యే ఫైనలియర్ చదువుతూండగా — చిన్నత్తయ్య పెద్దకూతురికి మా ఇంట్లో పెళ్ళి



చూపులు ఏర్పాటు చేయబడ్డాయి. కారణం వేరే ఏమీ లేదు. వరుడిది మా ఊరు. అతనికి పెళ్ళి చూపులకు వెళ్ళడానిక్కూడా సెలవు దొరకడం లేదుట (ఈ రోజుల్లో ప్రయాణపు ఖర్చులు భరించలేక మగపెళ్ళివారు చెప్పే సాకుల్లో ఇదొకటని మా ఇంట్లో లోపాయికారీగా అనుకుంటూ ంటారు).

అనుకున్నకంటే రెండురోజులు ముందుగానే చిన్నత్తయ్య కుటుంబం మా యింటికి వచ్చేసింది. ఓ గంట తేడాలో అత్తయ్యకూడా దిగింది. వరుడి కుటుంబానికి అత్తయ్య బాగా తెలుసునట. ఈ సంబంధం స్థిరపర్చడంలో ఆవిడ చాలా పెద్ద పాత్ర వహించాల్సి వుందని చిన్నత్తయ్య తేల్చేసింది. అత్తయ్య సంతోషంగా అంగీకరించడమేకాక—తన పాత్రను సమర్థవంతంగా నిర్వహించింది. ఆవిడ మాట మీదనే పెళ్ళి సంబంధం స్థిరపడింది. కట్నం ఎనిమిదివేలు.

పెళ్ళివారి ముందు అత్తయ్య చిన్నత్తయ్య గుణగుణాలు పొగిడి—పెళ్ళి కూతురు అన్ని గుణాలూ తల్లిదగ్గర పుణికి పుచ్చుకున్నదని చెప్పింది. ఆవిడ నోటంట నేను విన్న చిన్నత్తయ్య గుణాలు చాలా చాలా గొప్పవి. అవి విన్న ఎవరికైనా చిన్నత్తయ్యమీద అపారమైన గౌరవభావం కలుగుతుంది. అయితే చిన్నత్తయ్య గురించి అత్తయ్య కెటువంటి భావాలున్నాయో నాకు తెలుసును కాబట్టి—ఆవిడ మాటలు విన్నప్పుడు నాకు చిన్నత్తయ్యమీద కాక అత్తయ్యమీదనే గౌరవభావం పెరిగింది.

ఒకపెళ్ళి జరిపించడంకోసం అత్తయ్య తనకు నచ్చని వ్యక్తిని పొగుడుతోంది. అందుకు ఎంతటి విశాల హృదయముండాలి?

పెళ్ళివారు వెళ్ళిపోయాక చిన్నత్తయ్య అత్తయ్య చేయి పట్టుకుని—"అక్కయ్యా—నువ్వు అక్కవుకాదే దేవతవు! కానీ వాళ్ళు కట్నం ఎనిమిదివేలంటే చటుక్కున ఊ అనేయమన్నావు. బేరం చేయనివ్వలేదు. మేము అయిదువేలదాకా ప్రిపేరయి వున్నాం. అప్పైనా అప్పుచేయక తప్పదు...." అని ఇంకా ఏదో అనబోతూండగా

"చాల్లేవే—నాకు మాత్రం బాధ్యతలేదా? నీ కూతురికి నేను పరాయిదాన్నా? నాకు ఆడపిల్లే రు గాబట్టి నీకూతురే నా కూతురనుకుంటాను. నీకేం డబ్బుబాధ లేదు. అవసరమైనంతా నేను సర్దుతాను. తీర్చగలిగింది తీరుద్దురుగాని...." అనేసిందత్తయ్య.

నీ ఋణం చర్మంతో చెప్పులు కుట్టించి ఇచ్చినా తీరదంది అత్తయ్య. నిజమే ననిపించింది నాకు.


పెళ్ళికి అయిదువేలుసాయంచేసిందత్తయ్య. ఘనంగా జరిగిపోయింది వివాహం. పెళ్ళిలో అనుకున్నంత పెత్తనం లభించలేదత్తయ్యకు. గౌరవమర్యాదలకు లోటు జరక్కపోయినా—అన్నీ తనన్నట్లు జరగనందుకు అత్తయ్యక్కోపం వచ్చింది. ఆవిడ కోపం నా కంత న్యాయంగా తోచలేదు. ఆవిడిచ్చిన సలహాలు ప్రాక్టికల్ కావు. అందువల్ల పెళ్ళి చెడిపోయే ప్రమాదంకూడా వుంది.

పెళ్ళైపోయాక అత్తయ్యా చిన్నత్తయ్యా మాటామాటా అనుకున్నారు! పెద్ద పోట్లాటైంది. ఇంట్లో చాలామంది అత్తయ్యకే నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. అత్తయ్య త్వరగా మాటాముల్లే కట్టుకుని— "నా అయిదువేలూ నాకు త్వరగా అందేలా చూడు—" అని వెళ్ళిపోయింది.

అత్తయ్యంటే నాకు కాస్త అసహ్యం వేసినా జాలికూడా కలిగింది. ఆవిడవల్ల అంత సహాయం పొందిన వారావిడ్ని మాటలతో ఒప్పించడానికి ప్రయత్నించాల్సింది.

"ఏరుదాటేక బోడి మల్లయ్య—" అంది అత్తయ్య వెళ్ళేముందు. ఆ మాటల్లో నిజంలేకపోలేదు. పెళ్ళికి ముందు అత్తయ్యేలాంటి మాట చెప్పినా మారాడకుండా గంగిరెద్దులా తలూపేది చిన్నత్తయ్య. పెళ్ళి జరిగే సమయానికి అత్తయ్య మాటలు చేదైపోయి విసుక్కోవడం ఆరంభించింది. విసుక్కోకుండా సౌమ్యంగా మాట్లాడి వుంటే బాగుండేది?

అయితే అత్తయ్యా, చిన్నత్తయ్యా విడిపోవడం జరగలేదు. చిన్నత్తయ్య కూతుర్ని,




అల్లుణ్ని అత్తయ్య ఓ పండక్కి ఆహ్వానించి బట్టలుపెట్టి పంపించింది. వాళ్ళు వెళ్ళేక చిన్నత్తయ్య కూతురి ప్రవర్తన గురించి—"మా కాలంలో ఇలాంటివి ఎరుగమమ్మా—పట్టపగలే మొగుణ్ణి రాసుకు తిరగడాలూ, రాత్రి తొమ్మిది కాకుండా గదిలోకెళ్ళి తలుపేసుకోవడాలూ—" అంటూ విమర్శించింది.

చిన్నత్తయ్య కూతురు నాకు రాసిన ఉత్తరంలో — తనను తల్లికంటె ఆప్యాయంగా ఆదరించిన అత్తయ్య గురించిన పొగడ్తలే ఎక్కువగా వున్నాయి—"ఇవేమీ పూర్వకాలపు రోజులు కాదర్రా—మొగుణ్ణి అంటిపెట్టుకు తిరక్కపోతే—త్వరలోనే చేయిదాటిపోతాడు" అనేదట. తనకెంతో సిగ్గుగా వున్నా అత్తయ్య గురించి ఎప్పుడూ మొగుడి పరిసరాల్లోనే మెలగవలసొచ్చిందట.

అత్తయ్య ప్రవర్తన గురించి వ్యాఖ్యానిస్తూ అన్నయ్యోసారి నాతో—"అత్తయ్యకు అధికార దాహముంది. ప్రతిపనికీ తన పెత్తనం కావాలంటుంది. పెత్తనం ఇస్తే ఎంత సాయమైనా చేస్తుంది. లేకపోతే మాత్రం నానా మాటలూ అంటుంది" అన్నాడు.

అందులో నాకు నిజం కనిపించలేదు. అదే నిజమైతే ఆవిడ ఆదరించిన మనుషుల్ని వాళ్ళు వెళ్ళేక ఎందుకు దుయ్యపడుతుంది? అవతలివారి ప్రవర్తనలోనే ఏదో లోపముండి వుండాలి? నాకు తెలిసినంతవరకూ చిన్నత్తయ్యకు మాట్లాడడం చేతకాదు. ఎదుటివారిని గాయపరిచేలా మాట్లాడడం ఆవిడకు అనుకోని అలవాటు. ఈ అలవాటు ఆవిడ పెద్దకూతురికూడా కొంత సంక్రమించింది. నేనునన్నాంటే పెద్దవాళ్ళతో మాట్లాడేటప్పుడు — వాళ్లన్నదానికి ఔననడం తప్ప వాదించను. నా అభిప్రాయాలు నాలోనే దాచుకుంటాను. అందుకే అత్తయ్యతో నాకూ ఎప్పుడూ ఏ గొడవా రాదు. రాలేదు—అని నా నమ్మకం.

అందుకే—"ఎదురుగా ఒకమాట చాటుగా మరో మాట అనడం పూర్వకాలపు ఆడవాళ్ళ లక్షణం" అని పెద్దన్నయ్య చెప్పిన మాట కూడా నాకు నచ్చుబాటుకాలేదు.

నేను పెళ్ళై కాపురానికి వెళ్ళేక మరో కొత్త విషయం తెలుసుకున్నాను. నేనుండేది మా ఆయన ఆఫీసు నానుకునే వున్న కాలనీలో. అది తెలుగుదేశం కాకపోయినా అక్కడ

తెలుగువాళ్ళు చాలామంది వున్నారు. తీరుబడి బాగానే వున్నమూలాన—ఆడవాళ్ళం రోజూ ఎవరి వీలునుబట్టి వాళ్ళు ఎక్కడో అక్కడ కలుసుకుంటూండేవాళ్ళం.

అంతవరకూ నా చదువేమిటో నేనేమిటో మూలాన ఆడవాళ్ళ సమావేశాలెలా వుంటాయో నాకంత బాగా తెలియదు. ఒక నెలరోజుల్లోనే ఈ సమావేశానికి సంబంధించిన ఒక చిత్ర మైన విశేషాన్ని కనుగొన్నాను.

ఉదాహరణకు పద్మావతిని తీసుకోండి. ఆవి డింటికి విశాలాక్షి వస్తుంది. ఇద్దరూ కలిసి నాలుగిళ్ళ కవతలున్న కామాక్షమ్మ లోపాల్ని గురించి చర్చిస్తారు. ఆ చర్చ వింటున్నంత సేపూ పద్మావతివీ, విశాలాక్షివీ ఒకటే అభిప్రాయలనీ కామాక్షమ్మ చాలా చెడ్డదనీ తోస్తుంది. విశాలాక్షి వెళ్ళిపోయిన కాసేపటికి సుందరి వస్తుంది. ఆమె, పద్మావతి కలిసి విశాలాక్షి లోపాలను చర్చిస్తారు. అప్పుడు పద్మావతివీ సుందరివీ ఒకటే అభిప్రాయాలనీ — విశాలాక్షి చాలా చెడ్డదనీ తోస్తుంది. అదయ్యేక కామాక్షమ్మ వస్తుంది. అప్పుడు పద్మావతివీ కామాక్షమ్మవీ ఒకటే అభిప్రాయాలు.

కొద్ది రోజులు గడిచేసరికి నాకు మతిపోయి నట్లయింది. 'వీరిలో ఎవరికి ఎవరు శత్రువులు? ఏ ఇద్దరివి ఏకాభిప్రాయాలు?

పై ప్రశ్నలకు జవాబు తెలియకపోయినా నలుగురాడవాళ్ళు కలిసినప్పుడు—ఆ చుట్టు పక్కల లేని అయిదో ఆడదానిమీద నేరాలు చెప్పుకోవడం ఆ సమావేశంలో ముఖ్యాంశమని నాకు బాగా అర్థమైంది.

ఒకసారి యధాలాపంగా శ్రీవారికి విషయం చెప్పి అభిప్రాయమడిగాను. ఆయన చాలా ఆశ్చర్యంగా నావంక చూసి—"ఇది వరలో ఎన్నడూ మహిళామణుల సమావేశాలు చూడలేదా నువ్వు? మా ఇంట్లో మా అమ్మ దగ్గర చాలా జరుగుతూండేవి. అక్కడా ఇలాగే వుండేది. ఇదేమీ నాకు కొత్తకాదు" అనేశారు.

నా మనసు కాస్త చివుక్కుమంది. ఆయన ఆడవాళ్ళని అవమానించినట్లు ఫీలయ్యాను-

"అయితే ఇది స్త్రీలకే ప్రత్యేకమంటారా?"

"అబ్బే—నా అభిప్రాయమదికాదు. ఇలా నేరాలు చెప్పుకోవడం పనిలేనివాళ్ళు చేసేపని. గవర్నమెంటాపీసుల్లో ఉద్యోగులుకూడా ఈ పని చేస్తుంటారు"

"ఎందుకని?"

"ఏమో?"

"నాకు తెలుసు. ప్రతి మనిషికీ ఎదుటివారి మీద కొన్ని అభిప్రాయాలుంటాయి. అవకాశ మొచ్చినపుడు వాటిని ప్రకటిస్తూంటాడు. ఎదుటి మనిషిలోని లోపాల్ని గుర్తించే అలవాటు మని షికి చాలామంచిది. అది తన్ను సంస్కరించు కునేందుకు పనికి వస్తుంది"

శ్రీవారు గట్టిగా నవ్వి అక్కణ్ణించి లేచి వెళ్ళారు. ఆయనలా ఎందుకు చేశాడో నా కర్థం కాలేదు. నేనూ లేచివెళ్ళి వారిని అనుస రించాను. ఆయన అలమారాలోంచి ఓ అయిదు నిముషాలు వెతికి ఓ బైండు పుస్తకాన్ని బైటకుతీసి నాకందించి- "చూడు" అన్నారు.

నేను చూశాను. ఆ పుస్తకంలో ప్రతిపేజి లోనూ ఒకదాని ప్రక్క ఒకటిగా న్యూసు పేపర్ కటింగ్సున్నాయి. ఒకే వ్యక్తికి సంబం ధించిన పరస్పర విరుద్ధమైన వార్తలున్నాయి వాటిలో.

పార్టీ ఒక అభ్యర్థిని సూచించినంత మాత్రాన సభ్యులందరూ ఆ వ్యక్తిని సమర్థించాలని లేదు. ఎవరి అంతరాత్మ ప్రబోధం ప్రకారం వారు ఓటు చేయవచ్చు—అని ఇందిరాగాంధీ సంజీవరెడ్డిని అధ్యక్షునిగా ఎన్నుకునే విష యంలో అన్న వార్త వుంది. ఆ పక్కనే— పార్టీకి క్రమశిక్షణ అవసరం, రాజభరణాలు రద్దుచేయటం విషయంలో పార్టీ ఆజ్ఞనుల్లం ఘించిన సభ్యులపై క్రమశిక్షణ చర్య తీసుకో బడుతుంది—అని ఇందిరాగాంధీ అన్న వార్త వుంది.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశాన్ని కాంగ్రెస్ ఎంత ఉన్నతస్థానానికి తీసుకుని పోతోందో—ప్రస్తుత ఆర్థిక విధానాలు దేశా న్నెలా ముందుకు నడిపించ నున్నాయో— దేశాన్ని ముందుకు నడిపించగలిగినది కాంగ్రెస్

పార్టీ ఒక్కటే ఎలా అవుతుందో ఒక వార్తలో వివరిస్తున్నాడు మొరార్జీ దేశాయ్. ముప్పై ఏళ్లుగా కాంగ్రెస్ విధానాలు దేశాన్నెలా అధోగతికి తీసుకుపోయాయో—అది సవరించ వలసిన అవసరం ఎంతగా వున్నదో వివరిస్తున్నాడు మొరార్జీ దేశాయ్—పక్కవార్తలో.

ఎమర్జన్సీవల్ల దేశానికి కలిగిన లాభాల గురించి ఒక వార్తలో వివరించిన జగజీవన్ రామ్ పక్క వార్తల్లో ఎమర్జన్సీని, ఇందిరా గాంధీని ఖండిస్తున్నాడు.

ఇందిరాయే ఇండియా అని ఒక వార్తలోనూ, కాంగ్రెసు నాయకురాలిగా ఇందిర తగదని పక్క వార్తలలోనూ అంటున్నాడు బారువా.

పాకిస్తాన్ విషయంలో తీవ్రవైఖరిని పాటించాలనే వాజ్‌పాయ్ తనకుతానై పాకిస్తాన్ వెళ్లి రావడం పక్కపక్క వార్తలలో వివరించి వుంది.

ఒకటికాదు, రెండుకాదు—అలాంటి జంట వార్తలు కొన్ని పందలున్నాయా పుస్తకంలో!

"ఇవన్నీ చదివితే నీకేమనిపిస్తోంది?"

నేను మాట్లాడలేదు జవాబు ఆయనే ఇవ్వబోతున్నట్లు ముఖంచూసి గ్రహించాను.

"రాజకీయాల్లోనూ, క్రీడారంగంలోనూ,నిత్య కృత్యాల్లోనూ ఈ ఆరోపణలు చాలా ముఖ్యమైనవి—ఫిజికల్ ఫిట్‌నెస్ ట్రయినింగ్‌లాంటివి. ఇవి మనిషిని అలర్ట్‌గా వుంచుతాయి. ఒక పక్షం వాడింకో పక్షాన్ని నిందించాడంటే—ఆ రెండో పక్షంలో లోపాలున్నాయని కాదు. నిందించినవాడు రెండో పక్షానికి చెందడని అర్థం. ఏ రంగంలోనైనా ఈ ఆరోపణలు మనిషి అభిప్రాయాలు తెలుసుకుందుకు పనికి రావు. రాజకీయాల్లో అయితే వీటినిబట్టి మనిషి ఏ పార్టీకి చెందుతాడో, ఏ పార్టీకి చెందడో తెలుసుకోవచ్చు. అలాగే మీ ఆడవాళ్ళ సమావేశాల్లో ఒక మనిషి గురించి చెడ్డగా చెప్పుకుంటున్నారంటే ఆ మనిషి చెడ్డదని కాదు, ఆమె అప్పటికి అక్కడ లేదని అర్థం "

శ్రీవారు చెప్పనిదింకో విషయంకూడా నాకు అర్థమైంది. తన గొప్పతనాన్ని పెంచుకుందుకూ ఎదుటివాడి గొప్పతనాన్ని దించడానికీ కూడా మనిషి ఈ ఆరోపణల నుపయోగిస్తాడు. అత్తయ్య అందర్నీ ఆదరించినా తను ఎటువంటి వాళ్ళ నాదరించగలిగిందో, తనది ఎంత విశాలహృదయమో తెలియజేయడం కోసమే ఈ ఆరోపణలు చేసేదనిపించింది నాకు. ఎదుట సేవలు చేసీ, పరోక్షంలో ఆరోపణలుచేసీ—అందరివద్దనూ అత్తయ్య మంచిపేరు సంపాదించాలనుకుంటోంది. అయితే అత్తయ్యలాంటి వాళ్ళు దేశం నిండా అన్ని రంగాల్లోనూ వున్నారు. వాళ్ళందర్నీ అత్తయ్యలనే పిలిస్తే- అలాంటి ఎందరిలోనో ఒక అత్తయ్య కథ మాత్రమే ఇది!

ఈ సత్యం గ్రహించాక అత్తయ్య మా పిన్నిదగ్గర నా గురించి చాలా చెడ్డగా అన్నదని ఆ తర్వాత ఎప్పుడో తెలిసినపుడు నేనాశ్చర్య పడనూలేదు, బాధపడనూలేదు. □

---

ఒక లావుపాటావిడ బక్కపాటి మొగుణ్ణి కొట్టింది. ఆయనకి పౌరుషం ఎక్కువ. నిజంగా కొట్టావా? వేళాకోళానికా?'' అనడిగాడు.

"నిజంగానే కొట్టాను. ఏం చేస్తారు?'' మళ్లా మీదకొచ్చింది.

"అయితే పర్లేదు. వేళాకోళాలు మన దగ్గర పనిచెయ్యవ్'' అని బైటికిపోయి సినిమాకెళ్ళి రాత్రికి యింటికి చేరాడు. లావుపాటావిడ వదల్లేదు. "ఏమిటీ మధ్యాహ్నం కూశారు. వేళాకోళంగా కొట్టాననుకోండి. ఏం చెయ్యగలరు '' అంది జుట్టట్టుకుని.

"నిజంగా కొడితే చంపేద్దును'' అన్నాడాయన విడిపించుకుని.

—సోమిన శివరామప్రసాద్, రాజమండ్రి